సాక్షి
రంగారెడ్డి
శనివారం । 10 । జూన్ । 2023



పండ్ల మొక్కలు పెంచుతాం

దేవాలయ స్థలంలో పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గుట్ట దేవాలయ కార్యనిర్వహణ అధికారి గీత అన్నారు. 8లో▸



పత్తి విత్తనాల కృత్రిమ కొరత

ఒకవైపు వానాకాలం సీజన్ ప్రారంభం కావడం.. మరోవైపు విత్తనాల కొరత రైతులను వేధిస్తున్నాయి. 8లో▸



వికలాంగుల బంధు ఇవ్వాలి

వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలని పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మైసిగండి మైసమ్మ సన్నిధిలో ఇన్‌కంటాక్స్ కమిషనర్



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఏపీ అండ్ తెలంగాణ ఇన్‌కంటాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యం తట్టుకోలేక కానిస్టేబుల్ ఆత్మహత్య



వినోద్‌కుమార్ (ఫైల్)

యాచారం: అనారోగ్యం తట్టుకోలేక ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలివీ.. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడకు చెందిన ఆర్ల బుచ్చయ్య, మణెమ్మ దంపతుల కుమారుడు వినోద్‌కుమార్(25) మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన వినోద్‌కుమార్ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో గడ్డమల్లయ్యగూడలోని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికందివచ్చిన కొడుకు ఆసరా అయ్యే సమయానికే ఆత్మహత్యకు పాల్పడడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

జిల్లా సహాయ గణాంక అధికారి నరేందర్



బడిబాటలో ఏఎస్ఓ నరేందర్ తదితరులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన అందుతుందని, బడీడు పిల్లలను చేర్పించాలని జిల్లా సహాయ గణాంక అధికారి(ఏఎస్ఓ) నరేందర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి, పాఠశాలలో వసతులు, విద్య, క్రీడలు, సాధించిన ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఏఎస్ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనఊరు-మన బడి ద్వారా పాఠశాలలో అదనపు గదులు, ఇంటర్నెట్ సౌకర్యం, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధన, సురక్షితమైన తాగునీరు, నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన భోజనం, వారానికి మూడు గుడ్లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల దుస్తులు అందజేస్తున్నట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసచారి, రాధాకృష్ణారెడ్డి, చంద్రమోహన్, జంగయ్య, భాస్కర్‌రావు, శ్వేత, మాధురి, కౌసల్య, రాఘవేంద్రచారి తదితరులు ఉన్నారు.


షాద్‌నగర్‌లో భారీ వర్షం



ఓ దుకాణంలోకి చేరిన వరద నీరు

షాద్‌నగర్: ఈదురు గాలులతో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు కాలనీల్లోకి నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గంటన్నర పాటు కురిసిన వర్షానికి రాఘవేంద్ర కాలనీ, పటేల్ రోడ్డు తదితర కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. పట్టణంలోని పాత జాతీయ రహదారిలో ఉన్న ఓ భవనంలోని సెల్లార్‌లో ఉన్న ఆటో మొబైల్, జిరాక్స్ దుకాణాల్లోకి వర్షం నీరు చేరింది. ఈదురు గాలులకు పాత జాతీయ రహదారి పక్కన ఉన్న చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కదలరు.. వదలరు!





డిప్యూటేషన్లపై వచ్చి పాగా

- ఏళ్లుగా ఒకేచోట తిష్ట
- బదిలీ చేసినా.. పదోన్నతి కల్పించినా ససేమిరా
- వైద్య ఆరోగ్యశాఖలో ఇష్టారాజ్యం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కొంతమంది ఉద్యోగులు ఏళ్లుగా పాతుకుపోయారు. ఇతర జిల్లాల నుంచి అడ్డదారుల్లో డిప్యూటేషన్లపై వచ్చి కొందరు.. అదే జిల్లాలో మారుమూల ప్రాంతాల పీహెచ్‌సీల నుంచి అర్బన్ ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీలకు ఓరల్ ఆర్డర్లపై వచ్చిన వారు మరికొందరు ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయారు. బదిలీ చేసినా..చివరికి పదోన్నతులు కల్పించినా కూర్చున్న కుర్చీని మాత్రం వదలడం లేదు. ఆమనగల్లు యూపీహెచ్‌సీకి చెందిన ఎంపీహెచ్ఎస్ కె.శ్రీనివాసులుకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఇటీవల ఎంపీహెచ్ఓగా పదోన్నతి కల్పించింది. నిజానికి ఆయన ఆమనగల్లులో పోస్టింగ్ పొంది.. నాలుగేళ్లుగా ఎలాంటి ఆర్డర్లు లేకుండా ఓరల్ ఆర్డర్‌పై బాలాపూర్ యూపీహెచ్‌సీలో పని చేస్తున్నారు. పదోన్నతి కల్పించినా.. తీసుకునేందుకు నిరాకరించడం వెనుక అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.

సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లేక..

బాలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో పహడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్, నాదర్‌గుల్, బడంగ్‌పేట, మీర్‌పేట, జిల్లెలగూడ, లెనిన్‌నగర్‌లో సబ్‌సెంటర్లు కొనసాగుతున్నాయి. ఆరుగురు సూపర్‌వైజర్లు పని చేస్తున్నారు. నిజానికి ఒక మేల్, మరో ఫీమేల్ సూపర్‌వైజర్ సరిపోతారు. ఆరుగురు సూపర్ వైజర్లున్నా.. ఒకరిద్దరు మాత్రమే ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు. మిగిలిన వారు సొంత వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు. సూపర్ వైజర్ల పర్యవేక్షణ లోపం కారణంగా కొత్తపేట, జల్‌పల్లి, బాలాపూర్, పహడీషరీఫ్ సబ్ సెంటర్ల పరిధిలో వ్యాక్సినేషన్ ప్రక్రియ సక్రమంగా అమలు కావడం లేదు. మిజిల్స్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. డిప్యూటేషన్లపై కొనసాగుతున్న వారంతా జిల్లా ఉన్నతాధికారికి పెద్ద ఎత్తున ముట్టజెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏళ్లుగా అక్కడే పాగా..

- మొయినాబాద్‌లో విధులు నిర్వహించాల్సి ఉన్నా ఓ సీహెచ్ఓ బడంగ్‌పేటలో ఉంటూ బాలాపూర్ పీహెచ్‌సీలో ఓరల్ డిప్యూటేషన్‌పై పని చేస్తున్నారు. గెజిటెడ్ సంతకాల దందా నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇదే కేసులో ఓసారి పట్టుబడ్డారు. అవినీతి ఆరోపణలున్న ఆయనను మళ్లీ ఇక్కడికి ఎలా తీసుకొస్తారనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది.
- కొందుర్గు పీహెచ్‌సీలోపని చేయాల్సి ఉన్నా ఓ ఎంపీహెచ్ఓ.. ప్రస్తుతం ఓరల్ డిప్యూటేషన్‌పై బాలాపూర్‌లో పని చేస్తున్నాడు. గతంలో ఆయన ఇక్కడ పని చేసి మళ్లీ ఇక్కడికే వచ్చి కూర్చున్నారు.
- భువనగిరి నుంచి లేమూర్ డిప్యూటేషన్‌పై వచ్చిన ఓ పీహెచ్ఎన్‌ను సైతం ఓరల్ డిప్యూటేషన్‌పై బాలాపూర్‌లో వేశారు. తాండూరు పీహెచ్‌సీకి చెందిన మరో హెల్త్ ఎడ్యుకేటర్ ఏకంగా డీహెచ్ నుంచి డిప్యూటేషన్ ఆర్డర్ తీసుకొని బాలాపూర్‌కు వచ్చి చేరారు. వీరంతా సబ్ సెంటర్లకు వెళ్లి ఏఎన్ఎంల పనితీరుతో పాటు బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్ తీరును పర్యవేక్షించాలి.
- చంపాపేట యూపీహెచ్‌కి చెందిన ఓ ఫార్మాసిస్ట్ బాలాపూర్‌కు డిప్యూటేషన్‌పై వచ్చారు. ఇటీవల ఇక్కడికి రెగ్యులర్ ఫార్మాసిస్ట్ వచ్చారు. ఏడాది క్రితమే ఆయన్ను ఇక్కడి నుంచి రిలీవ్ చేయాల్సి ఉన్నా.. ఇప్పటికీ చేయలేదు.
- నందనవనంకు చెందిన ఓ కాంట్రాక్ట్ ల్యాబ్‌టెక్నీషియన్ నాలుగేళ్ల నుంచి బాలాపూర్‌లోనే కొనసాగుతున్నాడు. రెగ్యులర్ ఆర్డర్‌పై ఏడాది క్రితమే మరో టెక్నీషియన్ ఇక్కడికి వచ్చినా.. డిప్యూటేషన్‌పై ఉన్న టెక్నీషియన్‌ను అక్కడి నుంచి రిలీవ్ చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటో అంతు పట్టడం లేదు.
- బాలాపూర్ యూపీహెచ్‌సీలో పని చేస్తున్న ఓ కాంట్రాక్ట్ ల్యాబ్‌టెక్నీషియన్ ఇటీవల శివరాంపల్లికి డిప్యూటేషన్‌పై వెళ్లింది. బాలాపూర్ లేదా సరూర్‌నగర్ పీహెచ్‌సీ వైద్యులు మాత్రమే ఆమెను రిలీవ్ చేయాల్సి ఉన్నా.. సంబంధం లేని మీర్‌పేట్ యూపీహెచ్‌సీ డాక్టర్ ఎలా రిలీవ్ చేసిందో అర్థం కావడం లేదు.

ప్రభుత్వ రోగులు.. ప్రైవేటు క్లినిక్‌కు

ప్రభుత్వ ఉదాసీనత.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం రోగులపాలిట శాపం అవుతోంది. నిత్యం అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది సొంత క్లినిక్‌లకే పరిమితమవుతున్నారు. ఫలితంగా నిరుపేదలకు వైద్యసేవలు అందకుండా పోతున్నాయి. చికిత్సల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన వచ్చినవారినే కాదు.. ఏకంగా ప్రభుత్వం సరఫరా చేసిన మందులను సైతం సొంత క్లినిక్‌లకు తరలిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా పెద్దషాపూర్ పీహెచ్‌సీకి చెందిన ఓ వైద్యుడు అక్కడికి వచ్చిన రోగులను శంషాబాద్‌లోని తన సొంత క్లినిక్‌కు తరలిస్తూ బయట పడటం విశేషం.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- మంత్రి సబితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కంటే గొప్పగా ఎవరూ ఆలోచించలేరు. వృద్ధులకు పెద్ద కొడుకుగా, ఒంటరి మహిళలకు అన్నగా, ఆడబిడ్డ పెళ్లికి మేనమామగా ఆసరా అవుతున్నాడు' అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లో ఆయా సంక్షేమ పథకాల లబ్ధిదారులతో నిర్వహించిన సంబురాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కులవృత్తులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని చెప్పారు. బీసీ కుల వృత్తి కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తోందన్నారు. పేదలందరికీ గౌరవప్రదమైన జీవనం అందించాలనే ఉద్దేశంతో ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు గుర్తు చేశారు. వృద్ధులు, వితంతువుల పెన్షన్ మొత్తాన్ని రూ.200 నుంచి రూ.2016కు, దివ్యాంగులకు రూ.3,016 పెంచిందన్నారు. చేనేత, బీడీ కార్మికులు, గీత కార్మికులకు, ఒంటరి మహిళలు, బోధకాలు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ పేషంట్లకు సైతం పెన్షన్లు అందిస్తోందన్నారు. వృద్ధాప్య పెన్షన్ కనీస అర్హత వయస్సును 65 నుంచి 57 ఏళ్లకు తగ్గించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రతి నెల రూ.51 కోట్లను 2,30,500 మందికి ఆసరా పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.620 కోట్లను ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొత్తగా పెన్షన్లను మంజూరు చేయడం ద్వారా 4,077 మంది లబ్ధిదారులకు నెలకు రూ.96,20,000 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆడపిల్లల పెళ్లి ఖర్చుల భారాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 66,252 మంది ఆడ పిల్లలకు ఆర్థిక సహాయం అందిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పేదల వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం చేస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ చేపట్టినట్లు వివరించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో ఒక్కో విద్యార్థికి రూ.1,25,000 ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు. మిషన్ భగీరథతో ఇంటింటికీ నల్లా నీరు ఇవ్వడంతో వేసవిలోనూ నీటి బిందెల గొడవలు లేవన్నారు. జిల్లాలో కులాంతర వివాహాలు చేసుకున్న నాలుగు జంటలకు రూ.2,50,000 చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. సరూర్‌గర్ మహిళా సమాఖ్య సంఘానికి రూ.1,25,000 చెక్కును అందించారు. జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు ఎగ్గే మల్లేశం, దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రామారావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి విమల, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా ఎస్సీ ఈడీ ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారవాణ వ్యవస్థ పటిష్టతకు చర్యలు

- ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్



విలేజ్ బస్ ఆఫీసర్లతో ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్ తదితరులు

షాద్‌నగర్: రాష్ట్రంలోని ప్రజా రవాణా వ్యవస్థను పటిష్టం చేసి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్ అన్నారు. షాద్‌నగర్ బస్ డిపోలో శుక్రవారం డిపో మేనేజర్ ఉష ఆధ్వర్యంలో విలేజ్ బస్ ఆఫీసర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం నాయక్ మాట్లాడుతూ.. ప్రతి గడపకూ ఆర్టీసీ కార్యక్రమాలను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో విలేజ్ బస్ ఆఫీసర్ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. గ్రామాల్లో నివసించే కండక్టర్లు, డ్రైవర్లు ఇతర సిబ్బందిని విలేజ్ బస్ ఆఫీసర్లుగా నియమించడం జరిగిందన్నారు. వారు కేటాయించిన గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేస్తారని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పెళ్లిళ్లు, శుభకార్యాలతో రద్దీ ఎక్కువగా ఉంటే అందుకు అనుగుణంగా బస్సు ట్రిప్పులను పెంచడం జరుగుతుందని అన్నారు. ఈ ఆఫీసర్లు ప్రవేటు వాహనాల్లో ప్రయాణిస్తే కలిగే అనర్థాలను వివరించడంతో పాటు రవాణా వ్యవస్థ చేపడుతున్న కార్యక్రమాల గురించి గ్రామాల్లో ప్రజలకు ఎప్పటికప్పుడు వివరిస్తూ వారిని చైతన్యం చేయాలని సూచించారు. సంస్థకు ఆదాయాన్ని పెంపొందించేలా కృషి చేయాలన్నారు. ప్రజలు, సంస్థకు విలేజ్ బస్ ఆఫీసర్లు అనుసంధానకర్తలాగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, సుధాకర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద పరిరక్షణకు కృషి

మీర్‌పేట: పురాతన వారసత్వ సంపదను కాపాడి భావితరాలకు కానుకగా ఇవ్వాలన్న ఉద్దేశంతోనే 200 ఏళ్ల చరిత్ర కలిగిన బురుజును నూతన హంగులతో పునఃనిర్మించినట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. మీర్‌పేటలో రూ.40 లక్షల వ్యయంతో పునఃనిర్మించిన బురుజును శుక్రవారం రాత్రి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన బురుజుని కాపాడుతూనే నూతనంగా తీర్చిదిద్దామని అన్నారు. ముఖ్యమంత్రి సహకారంతో మహేశ్వరం మెట్లబావిని కోటి రూపాయల నిధులతో త్వరలోనే అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. అనంతరం జిల్లెలగూడ నుంచి అల్మాస్‌గూడ వరకు రూ.85 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్ పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం

- తొలిరోజు 80 వేల మందికి పైనే..
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన జనం
- కిటకిటలాడిన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: ఆస్తమా రోగులు ఎంతగానో ఎదురుచూసే చేప ప్రసాదం పంపిణీ శుక్రవారం నగరంలో ప్రారంభమైంది. తొలిరోజు రాత్రి పొద్దుపోయే వరకు దాదాపు 80 వేల మందికి చేప ప్రసాదం ఇచ్చినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకు పంపిణీ ఉంటుందన్నారు. కాగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మొదట బత్తిని కుటుంబ సభ్యుల చేపప్రసాదం పంపిణీని శుక్రవారం ఉదయం 8 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా చేప ప్రసాదం వేసి ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆస్తమా రోగులు, సామాన్య ప్రజలు కూడా వేలాదిమంది తరలివచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్, మత్స్యశాఖ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఆర్అండ్‌బీ, వాటర్‌బోర్డు, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు పలు శాఖల ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ మేరకు పలు శాఖల ఉన్నతాధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఉండి ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అంతకు ముందు దూద్‌బౌలిలోని బత్తిని నివాసంలోనూ మొదట చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు.



ఎగ్జిబిషన్‌లో చేపప్రసాదాన్ని ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మంత్రి స్వయం పర్యవేక్షణ

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్వయంగా శుక్రవారం రోజంతా పర్యవేక్షించారు. ఉదయం ప్రారంభించిన మంత్రి రాత్రి వరకు పలుమార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టారు. వాటర్‌బోర్డు, బద్రి విశాల్ వంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మంచినీరు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, మజ్జిగ పంపిణీ చేశారు. ఇక నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, సెంట్రల్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, నగర కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి వరకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దాదాపు 90 వేల చేప పిల్లలను విక్రయించినట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాథోడ్ తెలిపారు. శనివారం ఉదయం వరకు ప్రజలకు అవసరమైనన్ని చేపపిల్లలను అందుబాటులో ఉంచామన్నారు. రాత్రంతా చేపమందు ప్రసాదం పంపిణీ కొనసాగుతుందని, చేప పిల్లల విక్రయం కూడా కొనసాగుతుందన్నారు.

32 కేంద్రాల ద్వారా పంపిణీ

చేప ప్రసాదాన్ని 32 కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. బత్తిని కుటుంబానికి చెందిన 250 మంది కుటుంబ సభ్యులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నాయకులు వలంటీర్లుగా సేవలందించారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్విని మార్గం, మాజీ కార్యదర్శి వినయ్‌కుమార్ ముదిరాజ్‌తో పాటు పలువురు ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు చేపప్రసాదం పంపిణీకి చేయూతనందించారు. దాదాపు 1000 మంది పోలీసులతో భారీ బందోబస్తు చేపట్టారు. 75 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిఘా నిర్వహించారు.

కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట

షాద్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని కుల వృత్తుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయన్నారు. ప్రభుత్వం చేసే ఆర్థిక చేయూతను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీడీఓ వినయ్‌కుమార్, నాయకులు యుగంధర్, రాంచందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

దైవచింతనతో మానసిక ప్రశాంతత

నందిగామ: దైవచింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండలంలోని చేగూరులో సర్పంచ్ సంతోష, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్ సొంత నిధులతో నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే శుక్రవారం ప్రథమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక వత్తిడి దూరం కావాలంటే దైవ చింతన అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ గణేశ్, ఎంపీపీ ప్రియాంక, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మహబూబ్‌నగర్ జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి, సర్పంచులు రజనీత, కుమార్, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

పత్తి విత్తనాల కృత్రిమ కొరత

- అధిక ధరలకు విత్తనాల విక్రయం
- చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు

కొందుర్గు: ఒకవైపు వానాకాలం సీజన్ ప్రారంభం కావడం.. మరోవైపు విత్తనాల కొరత సమస్య వేధిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్, చేవెళ్ల, పరిగి, తాండూరు, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో పత్తిపంటను విస్తారంగా సాగుచేస్తారు. గత ఏడాదిని పోలిస్తే ఈ ఏడాది పత్తిపంటను అధికంగా సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే పత్తి విత్తనాల స్టాకు తక్కువగా ఉందని ఆశించిన రీతిలో సరఫరా చేయలేకపోతున్నామని పత్తి విత్తనాల కంపెనీలు, డీలర్లు చెబుతున్నారు. ముఖ్యంగా గత ఏడాది కాస్తా దిగుబడి అధికంగా వచ్చినట్లు గుర్తించిన రకాలను రైతులకు ఇవ్వకుండా కృత్రిమ కొరత చూపుతూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

మార్కెట్లో దొరకడం లేదు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పత్తి విత్తనాల ప్యాకెట్ రూ.853కు విక్రయించాలి. కానీ కొన్ని రకాల విత్తనాలు సరైన సరఫరా లేదని తెలుపుతూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు. యూఎస్ అగ్రి సీడ్స్‌వారి 7067 రకం పత్తివిత్తనాల ప్యాకెట్ రూ.15 వందల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా ప్రవర్ధన్ సీడ్స్ వారి రేవంత్, నాథ్ సీడ్స్ వారి సాకేత్, నూజివీడ్ సీడ్స్ వారి ఆద్యా రకాలను రూ.12 వందల వరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే కోహినూర్ సీడ్స్‌వారి సదానంద్, మహికో సీడ్స్ వారి బౌన్సర్ రకాలను రూ.1000 వరకు అమ్ముతున్నట్లు తెలిసింది. ఇక రాశి సీడ్స్ వారి 659, తులసి సీడ్స్ వారి కబడ్డీ రకాలు రైతులకు లభించడం లేదు. కాగా, కొరత ఉన్న విత్తనాలను ఇదివరకే విక్రయించినట్లు అటు కంపెనీలు, ఇటు డీలర్లు బిల్లులు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే ఎక్కడో పేరు, ఊరు లేని రైతుల వివరాలు, లేదా ఇతర ప్రాంతాల రైతుల వివరాలు రాసి విత్తనాల స్టాక్‌కు సరిపడా బిల్లులు తయారు చేసినట్లు సమాచారం. ఈ విషయం వ్యవసాయాధికారులు డీలర్లకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పత్తివిత్తనాల ప్యాకెట్లు

అడిగినవి దొరకడం లేదు



గత ఏడాది కాస్తా దిగుబడి బాగా వచ్చిన విత్తనాలు ఈ ఏడాది నాటుదామనుకుంటే దొరకడం లేదు. ఎన్ని దుకాణాలు తిరిగినా ఫలితం లేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లి రూ. 1,500 వరకు అయిన ఖర్చుచేసి విత్తనాలు తెచ్చుకుంటున్నారు. రైతులు అడిగిన విత్తనాలు సరఫరా చేస్తే బాగుంటుంది.

– కొయ్యల నర్సింహులు, రైతు, ముట్పూర్

దుకాణాలు తనిఖీ చేస్తాం



విత్తనాలు విక్రయించే డీలర్ల దుకాణాలు తనిఖీ చేస్తాం. స్టాక్ వివరాలు, విక్రయించిన రైతుల వివరాలు సేకరిస్తాం. అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే తగు చర్యలు తీసుకుంటాం. రైతులు ఎవరైనా ముందుకొచ్చి అధిక ధరకు కొన్నట్లు వివరిస్తే సదరు డీలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రాజారత్నం, ఏడీఏ, షాద్‌నగర్

దాతల స్థలంలో పండ్ల మొక్కలు పెంచుతాం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఈఓ గీత

మొయినాబాద్ రూరల్: కనకమామిడిలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి యాదగిరిగుట్ట దేవాలయ స్థలంలో పండ్ల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వాహణ అధికారి గీత, సహాయ కార్య నిర్వాహణ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి సమీపంలో గల ఒక ఎకరం, నదీంనగర్ రెవెన్యూలోని ఒక 1.27 ఎకరాల భూమి పట్టాదారులు గతంలో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం దాతలు ఇచ్చిన భూమిని సందర్శించారు. స్థానిక సర్పంచ్ పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, మండల తహసీల్దార్ అశోక్ కుమార్‌లతో కలిసి ఈ స్థలంలో బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం భూ దాతలను దేవాలయ కార్యనిర్వాహకులు సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో స్థలానికి ప్రహరీ (ప్రీకాస్ట్) ఏర్పాటు చేసి తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పండ్ల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో షాపురం వెంకట్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నరేందర్, కోట్ల బల్వంత్‌రెడ్డి, అంతిరెడ్డిగారి మొహన్‌రెడ్డి, షాపురం నర్సింహారెడ్డి, మల్‌రెడ్డిగారి శ్రీనివాస్‌రెడ్డి, జియన్నగారి ఈశ్వర్‌రెడ్డి, పట్లోళ్ల విఠల్‌రెడ్డి, పంచలింగాల సుదర్శన్‌రెడ్డి, గాజుల రాఘవేందర్, సి.హెచ్.వెంకటేశ్, గ్రామ పెద్దలు, దేవస్థాన ఇంజనీర్ మైపాల్‌రెడ్డి, దేవస్థాన సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



దేవాలయానికి భూ దానం చేసిన దాతలను సన్మానించి ప్రసాదం అందజేస్తున్న గీత, శ్రావణ్‌కుమార్

సైక్లిస్ట్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

ఇబ్రహీంపట్నం రూరల్: సైక్లిస్ట్‌ను మిల్క్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటన ఆదిబట్ల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నా యి. బీఎన్‌రెడ్డి నగర్‌నుంచి బొంగ్లూర్ వైపు మిల్క్ వ్యాన్ వస్తుండగా మన్నెగూడ ఎక్స్ రోడ్డు వద్ద సైకిల్‌పై రోడ్డు క్రాస్ చేస్తున్న బాలాజీ కుమార్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీకి గాయలయ్యాయి.

భవనంపై నుంచి పడి చిన్నారి మృతి

శంకర్‌పల్లి: భవనంపై నుంచి పడి ఓ చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంతాన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేష్మికుమారి, రుదగిరి సింగ్ దంపతులు ఎనమిది నెలలుగా మండలంలోని దొంతాన్‌పల్లిలో అద్దెకు ఉంటున్నారు. గురువారం సాయంత్రం రేష్మి కుమారుడికి పాలు పడుతుండగా ఇద్దరు కూతుళ్ల మేడపైకి వెళ్లారు. ప్రమాద వశాత్తు రిషిక(3) భవనంపై నుంచి కింద పడింది. గమనించిన తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం శంకర్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ నరేష్ తెలిపారు.



రిషిక

చికిత్స పొందుతూ విశ్రాంత ఎంఈఓ మృతి

యాచారం: విశ్రాంత మండల విద్యాధికారి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యాచారం సీఐ లింగయ్య తెలిపిన వివ రాల ప్రకారం.. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన బుస్సు నారాయణరెడ్డి(78) పక్షం రోజుల కింద బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నారాయణరెడ్డి నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. 15 ఏళ్ల క్రితం నారాయణరెడ్డి యాచారం మండలానికి ఇన్‌చార్జి ఎంఈఓ విధులు నిర్వర్తించారు.

12న తెలంగాణ రన్

విజయవంతం చేయాలని ఆర్డీఓ పిలుపు

చేవెళ్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న చేవెళ్లలో తెలంగాణ రన్ నిర్వహిస్తున్నామని ఆర్డీఓ వేణుమాదవ్ రావు అన్నారు. చేవెళ్ల శుక్రవారం డివిజన్‌లోని నాలుగు మండలాల పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి పోలీసుశాఖ నుంచి పూర్తి మద్దతు ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. 12న ఉదయం 7గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. చేవెళ్ల పోలీస్‌స్టేషన్ నుంచి షాబాద్ చౌరస్తా వరకు వెళ్లి అక్కడి నుంచి తిరిగి పోలీస్‌స్టేషన్ వరకు పరుగు పందెం ఉంటుందని తెలిపారు. ఈ రన్‌లో ఆసక్తి గల వారంతా పాల్గొనవచ్చని చెప్పారు. వయస్సుతో సబంధం లేదని అన్నివర్గాల ప్రజలు పాల్గొన్నాలని కోరారు. యువత ఎక్కువగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థి విభాగంలో మొదటి, రెండో మూడో బహుమతులు కూడా ఉంటాయని వివరించారు. ఉద్యోగస్తులు , పోలీసు సిబ్బంది, యువజన సంఘాలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ పోటీలలో పాల్గొనే వారికి టీ-షర్టులు ఇస్తామన్నారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ పోటీలలో అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్, సీఐలు వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, గురువయ్యగౌడ్, ప్రసన్నకుమార్, నరేశ్ తదితరులు ఉన్నారు.

వికలాంగుల బంధు ప్రకటించాలి

- పోరాట సమితి అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట దర్నా



కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఇబ్రహీంపట్నం రూరల్: వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మందకృష్ణ విచ్చేసి మాట్లాడారు. వికలాంగులకు ప్రభుత్వం రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. దళితబంధు మాదిరిగా వికలాంగుల బంధు ప్రకటించాలని కోరారు. ప్రతి జిల్లాలో వికలాంగుల మహిళా వసతి గృహాలు ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల్లో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల భవనాలు నిర్మాణం చేయాలని కోరారు .వికలాంగుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. వికలాంగులకు పూర్తి స్థాయి పెన్షన్ ఇవ్వాలని, కోరిన చోటుకు ఉద్యోగుల బదిలీ చేయాలని కోరారు. వికలాంగుల మంత్రిత్వ శాఖ ఏర్పాటు కోసం ఇచ్చిన జీవో 34ను తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షులు గోపాల్‌రావు, మాజీ జాతీయ అధ్యక్షుడు అందె రాంబాబు, సుజాత సూర్యవంశి, సత్యనారాయణ, షణ్ముఖరావు, మంగమ్మ, కాశఖుం ,విజయరావు, భవానీ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో ఆత్మహత్య.. జహీరాబాద్‌లో విషాదం

అల్లీపూర్‌లో బీఆర్ఎస్ నేత లక్ష్మారెడ్డి అంత్యక్రియలు



లక్ష్మారెడ్డి (ఫైల్)

జహీరాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నేత డి.లక్ష్మారెడ్డి శంకర్‌పల్లిలో రైలు పట్టాలపైపడి ఆత్మహత్య చేసుకోగా, శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన అల్లీపూర్‌లో అంత్యక్రియలు జరిగాయి. టీడీపీ, బీఆర్ఎస్‌లో సీనియర్ నేతగా పనిచేసిన లక్ష్మారెడ్డి మరణంతో ఒక్కసారిగా జహీరాబాద్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లక్ష్మారెడ్డి రెండేళ్లుగా పార్టీ క్రియాశీలక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ నగరంలోని నిజాంపేటకు మకాం మార్చారు. అక్కడే రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు.

ఎంపీపీగా రాజకీయ ప్రస్థానం మొదలై...

లక్ష్మారెడ్డి టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేసి అంచలంచెలుగా ఎదిగారు. 1995లో టీడీపీ తరపున జహీరాబాద్ ఎంపీపీగా పనిచేశారు. ఆ సమయంలో కేసీఆర్ జిల్లా మంత్రిగా ఉన్నారు. ఇద్దరి మధ్య సత్సంబంధాలుండేవి. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత లక్ష్మారెడ్డి కేసీఆర్‌ను జహీరాబాద్‌కు పిలిపించుకొని ఆయన సమక్షంలోనే పార్టీలో చేరారు. 2017లో జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. రెండేళ్ల పాటు పదవిలో కొనసాగారు. అనంతరం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. లక్ష్మారెడ్డి తల్లి ఈశ్వరమ్మ కూడా ఒక పర్యాయం అల్లీపూర్ సర్పంచ్‌గా పనిచేశారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడి..

1999 అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ కోసం లక్ష్మారెడ్డి ప్రయత్నించారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న బాగన్నపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఆయనకు సమాంతరంగా రాజకీయాలు నెరిపారు. దీంతో బాగన్న, లక్ష్మారెడ్డిని కాదని గుండప్పకు టీడీపీ టికెట్ కేటాయించారు. రాష్ట్రంలో మారిన రాజకీయాల నేపథ్యంలో టీడీపీకి రాజీనామా చేసి అప్పట్లో మంత్రిగా ఉన్న జె.గీతారెడ్డి సమక్షంలో 2004 తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో ఇమడలేక 2016లో టీఆర్ఎస్‌లో చేరారు. ప్రస్తుతం లక్ష్మారెడ్డి డీసీఎంఎస్ డైరెక్టర్‌గా ఉన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ పదవిని ఆశించినా కలిసి రాలేదు.

స్వగ్రామంలో అంత్యక్రియలు

లక్ష్మారెడ్డి భౌతిక కాయానికి స్వగ్రామం అల్లీపూర్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలోనే అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు.